

సోమశిలలో 72.4 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 72.4 టీఎంసీల నీరుంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 3750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,470
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,100
3 శాతం జీఎస్టీతో	రూ.7,313
నవర (8 గ్రా)	రూ.58,504

గరిష్ఠం/కనిష్ఠం
30.6 /24.6

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 78 శాతంగా నమోదైంది.

జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన
ఓ సువర్ణ అధ్యాయం



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డికి తినిపిస్తున్న మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పలువురు నేతలు



ఎమ్మెల్సీ పర్వతరెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్ అనిల్‌కుమార్ యాదవ్, ఖలీల్ అహ్మద్ తదితరులు

- 2029లో మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం
- కూటమి ప్రభుత్వానివి కక్ష సాధింపు చర్యలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- జిల్లా కార్యాలయంలో ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

నెల్లూరు (బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలన ఒక సువర్ణ అధ్యాయమని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో కాకాణి నేతృత్వంలో పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యాలయ ప్రాంగణంలో ఉన్న దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి నేతలు ఒకరికొకరు తినిపించుకుని మిగిలిన అందరికీ పంచిపెట్టారు. కార్యకర్తలు, అభిమానులు కేరింతలతో పార్టీ జిల్లా కార్యాలయం దద్దరిల్లింది. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇటువంటి తరుణంలో నిర్బంధాలను లెక్క చేయకుండా స్వేచ్ఛగా, స్వతంత్రంగా పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చి జగన్ జన్మదిన వేడుకల్లో పాల్గొంటున్నారంటే ఆయన కారణజన్ముడని చెప్పవచ్చన్నారు. ప్రజల్లో ఆయన పట్ల ఉన్న ప్రేమ, అభిమానం ఎప్పటికీ తరగదన్నారు. రాజకీయంగా అధికారం కోల్పోయిన తర్వాత ఆయన ముఖ్యమంత్రిగా దిగిపోవడం ఈ రాష్ట్రానికి అరిష్టం, దురదృష్టమని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. ఏరోజు ఎన్నికలు వచ్చినా మరలా జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలనే ధృడమైన సంకల్పంతో ఉన్నారన్నారు. దీనికి కారణం ఐదేళ్ల ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం, ఇచ్చిన హామీలు నెరవేర్చడం, రాజ్యాధికారం వైపు పేదలను అడుగులు వేయించడం వంటి పనులు చేయడమేనన్నారు. ఏది ఏమైనా 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సామాజిక మార్పులు, సంక్షేమ పథకాల వల్లే ఆయనను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి వేసిన ప్రతి అడుగు ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునందతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం వద్ద శిబిరంలో రక్తదానం చేస్తున్న పార్టీ కార్యకర్తలు

దిశకు మెజార్టీ ఎమ్మెల్యేల డుమ్మా
- ఇద్దరు మాత్రమే హాజరు



మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (పొగతోట): నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ (డీడీసీఎంసీ/డీఐఎస్‌హెచ్ఏ) దిశ సమావేశం శనివారం జరిగింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశానికి మెజారిటీ శాసనసభ్యులు డుమ్మా కొట్టారు. ఈ సమావేశానికి ఉదయగిరి, కావలి శాసనసభ్యులు కాకర్ల సురేష్, దగుమాటి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తిలు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాసన సభ్యులెవరూ హాజరు కాలేదు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర పథకాలను పూర్తిస్థాయిలో గ్రామస్థాయికి తీసుకెళ్లి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అధికారులందరూ మనసు పెట్టి పని చేయాలని సూచించారు. జిల్లాలో 92 గ్రామాలకు రోడ్లు లేవని పంచాయతీ రాజ్ అధికారులు తెలిపారు. ఎంపీ స్పందిస్తూ రోడ్లు కనెక్టివిటీకి సంబంధించి ప్రణాళికలు పంపిస్తే నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జెడ్పీ చైర్ పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. కలువాయి, రాపూరు, తదితర మండలాల్లో అక్రమాలు అధికంగా జరిగాయన్నారు. అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుని పథకం సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమావేశం విషయం శాసన సభ్యులెవరికి తెలియజేయలేదని, పీఏలకు ఫోన్ ద్వారా చెప్పారన్నారు. అధికారులకు శాసనసభ్యులకు నేరుగా ఫోన్ చేసే తీరిక లేదా అంటూ ప్రశ్నించారు. కలెక్టర్ కలుగ చేసుకుని ఎమ్మెల్యేల కార్యాలయాలకు సమాచారం పంపించి, పీఏలకు ఫోన్‌ల ద్వారా తెలియచేశామని చెప్పినా శాసన సభ్యులు శాంతించలేదు. కలెక్టర్ ఆనంద్, ఎంఎల్‌సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్‌లు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ సీఈఓ విద్యారమ అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, అధికారులు తదితరులు

పీఎం సూర్యఘర్‌తో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. విద్యుత్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన ద్వారా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అవగాహన కలిగించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కాలనీల్లో ఇళ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అనుకూలంగా లేని చోట్ల ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలను గుర్తించి, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్‌కు జిల్లాలో ఇప్పటి వరకు 5,500 రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు.

న్యూస్‌రీల్


అల్లీపురం పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్ల నిరసన



హెల్త్ అసిస్టెంట్ల నిరసన ప్రదర్శన

నెల్లూరు సిటీ: రూరల్ మండలం అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం హెల్త్ అసిస్టెంట్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. టెర్మినేషన్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కొనసాగుతున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీరికి సహచర ఉద్యోగులు సంఘీభావం ప్రకటించారు. బాధిత హెల్త్ అసిస్టెంట్లు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో 20 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో తమను టెర్మినేషన్ చేయడంతో ఒక్కసారిగా తమ కుటుంబాలు వీధినపడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు కె.వి. సుబ్బారావు, ఎస్.చంద్రయ్య, ఓంకారం శ్రీనివాసులు, బి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓగా సుజాత
- పెంచలయ్య బదిలీ



డా.పెంచలయ్య



డాక్టర్ వి.సుజాత

నెల్లూరు(అర్బన్): డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్యను అల్లూరు సీతారామరాజు జిల్లా రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌ఓగా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 2022 మేలో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యత లేని లూప్‌లైన్ పోస్టును కేటాయించింది. ఆయన్ను గతంలో ఇక్కడకు డీఎంహెచ్‌ఓగా మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తీసుకొచ్చారన్నదే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. రాజకీయ కోణంలోనే ఆయన్ను ప్రాధాన్యత లేని పోస్టుకు పంపారని సమాచారం.

నూతన డీఎంహెచ్‌ఓగా వి.సుజాత

ప్రస్తుతం అనంతపురం జిల్లా ఆత్మకూరు రూరల్ హెల్త్ అధికారిగా డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో పనిచేస్తున్న వి.సుజాతకు సివిల్ సర్జన్ హోదాలో పదోన్నతి కల్పించి నెల్లూరు జిల్లా డీఎంహెచ్‌ఓగా బదిలీ చేశారు. ఆమె మరో రెండు రోజుల్లో ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు.

సమగ్రశిక్ష ఏపీసీగా వెంకటసుబ్బయ్య



వెంకటసుబ్బయ్య

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్ష ఏపీసీగా డి.వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటసుబ్బయ్య ప్రస్తుతం ఉదయగిరిలోని ఎంఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ఇక్కడ పనిచేస్తున్న ఉషారాణిని మాతృ సంస్థకు బదిలీ చేశారు. ఈమె 2021 డిసెంబరులో ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు.

సజావుగా ప్రాజెక్టు కమిటీల ఎన్నిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో సాగునీటి సంఘాల ప్రాజెక్టు కమిటీలకు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. జిల్లాలో ఆరు ప్రాజెక్టు కమిటీలు ఉండగా ఐదింటికి ఎన్నికలు నిర్వహించారు. మేజర్ ప్రాజెక్టులకు సంబంధించి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకోగా మైనర్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకున్నారు. ప్రాజెక్ట్ కమిటీలకు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారికి ఎన్నికల అధికారులు డిక్లరేషన్ పత్రాలు అందజేశారు.

చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా..

పెన్నార్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా జెట్టి రాజగోపాల్ రెడ్డి.. వైస్ చైర్మన్‌గా బీద గిరిధర్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీకి వేలూరు కేశవ చౌదరి, పులుగుంట మధుమోహన్‌రెడ్డి, కనుపూరు కాలువ ప్రాజెక్టు కమిటీకి వడ్డినేని చిన మస్తానయ్య, తుళ్లూరు రామయ్య, గండిపాలెం ప్రాజెక్టు కమిటీకి అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, రాళ్లపాడు ప్రాజెక్టు కమిటీకి ఏలూరు వెంకటేశ్వర్లు, నరాల మాలకొండారెడ్డి, వీఆర్ కోట ఆనకట్ట సిస్టం ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా తలపనేని వెంకట రవీంద్రబాబు, వైస్ చైర్మన్‌గా తోకల మాల్యాద్రి ఎన్నికయ్యారు.

సండే స్పెషల్
ఎడ్లంటే ప్రేమ.. పోటీలకు సై..

ఆ యువకుడికి వ్యవసాయమన్నా, పశువుల పెంపకమన్నా ప్రాణం. ఉన్నత చదువులు అభ్యసించి సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నా.. మనసంతా ఎడ్లపైనే ఉండేది. ఆ మమకారంతోనే రెండు కోడె దూడలను కొనుగోలు చేసి వాటికి రాముడు, భీముడు అని ముద్దుగా పేర్లు పెట్టుకుని పిలుస్తున్నాడు. అవి ఇప్పుడు పెద్దవయ్యాయి. రాష్ట్రస్థాయి ఎడ్ల పందేల్లో (బండ లాగుడు) పాల్గొని అవి ప్రథమ స్థానంలో నిలవాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నాడు.

–పొదలకూరు

- మూడేళ్ల క్రితం రెండు కోడె దూడల కొనుగోలు
- ముద్దుగా రాముడు, భీముడని పేర్లు
- రాష్ట్రస్థాయి ఎడ్ల పందేల్లో గెలవాలని..
- వాటికి రోజూ రూ.2 వేల ఖర్చు
- జీతమంతా వాటి పెంపకానికే..
- ఇదీ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తీరు

ఆ యువకుడి పేరు బుధవరపు ప్రతాప్. పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీ ముత్యాలపేట గ్రామం. సాక్షి అతడిని పలుకరించగా ఏం చెప్పారంటే... మాది వ్యవసాయ కుటుంబం. నేను కావలి విట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో చదివాను. ఐదేళ్ల క్రితం హైదరాబాద్ హెచ్‌సీఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరాను. కరోనా సమయంలో వర్క్‌ఫ్రం హోమ్‌లో భాగంగా ఇంటి నుంచే పని చేసేవాడిని. ఉద్యోగంలో జీతం బాగానే వస్తున్నా ఏదో తెలియని వెలితి ఉండేది. తాత, తండ్రుల నుంచి పోషిస్తున్న ఎడ్లపై అభిలాష కలిగింది.

తండ్రి సహకారంతో..

ఒంగోలు జాతికి చెందిన కోడెలు కొనుగోలు చేసి పోషించాలని భావించి మా నాన్న పెంచలయ్యతో చెప్పాను. దానికి ఆయన మొదట సందేహించినా నా ఇష్టాన్ని కాదనలేదు. తండ్రి సహకారంతో వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామంలో 8 నెలల వయస్సు ఉన్న దూడను రూ.80 వేలు వెచ్చించి, అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏడాది వయసున్న దూడను రూ.లక్ష వెచ్చించి కొన్నాను. వాటిని జాగ్రత్తగా సంరక్షించుకుంటున్నాను.

ఆలనాపాలనకు..

కోడెదూడలను కొనుగోలు చేసిన నాటి నుంచి వాటి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాను. వాటిని రాముడు, భీముడు అనే పేర్లతో మా కుటుంబమంతా పిలుచుకుంటున్నాం. వాటి ఆలనాపాలనకు నెల జీతం ఇచ్చి ఓ మనిషిని కూడా ఏర్పాటు చేశాను. చెబితే అతిశయోక్తిగా ఉంటుందేమో కానీ వాటి పోషణకు నిత్యం రూ.2 వేలు వరకు ఖర్చు చేస్తున్నాను. పశుగ్రాసంతోపాటు ఉలవలు, జొన్నలు కూడా పెడుతున్నాం.



రాముడు, భీముడును శిక్షణకు తీసుకెళ్తున్న ప్రతాప్

అలసట తీర్చుకునేలా...

నేను కోడెలను కొని మూడేళ్లయింది. వాటి వయసు ఇప్పుడు నాలుగేళ్లు. పోటీలకు సిద్ధం చేసే ఉద్దేశంతో శిక్షణ ఇప్పిస్తున్నాను. తోటలోనే పరుగులు తీయించి అలసటను తట్టుకునేలా అలవాటు చేస్తున్నాను. పశువైద్యుల సలహాలు సూచనలు తీసుకుని వాటి ఆరోగ్యంపై పరీక్షలు కూడా చేయిస్తున్నాను.



ఎడ్లకు బండలాగుడులో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నా



రాముడు, భీముడుకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తే రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో రాణిస్తాయని నమ్మకంగా ఉంది. ఇందుకోసం నెలకు రూ.30 వేలు వెచ్చించి వైఎస్సార్ జిల్లా చెన్నూరులో నెల కిందటే శిక్షకుడి వద్ద వదిలిపెట్టాను. ప్రతినిత్యం వాటిని వీడియోకాల్లో చూసుకుంటూ శిక్షణకు ఎలా సహకరిస్తున్నాయో తెలుసుకుంటున్నాను. నా ఎడ్ల గురించి తెలిసిన కొందరు రైతులు మంచి ధరతో కొనుగోలు చేస్తామని ముందుకొచ్చినా నేను ససేమేరా అన్నాను. బండలాగుడు పోటీల్లో అవి ప్రథమ స్థానంలో నిలవడమే నా లక్ష్యం.

ఇది ఉత్తుత్తి కళాశాల!

వినోదం సినిమాలో హీరో అతని మిత్రులు కలసి ఉత్తుత్తి బ్యాంకు ఏర్పాటు చేస్తారు. తెలిసినవారి వద్ద నుంచి డబ్బులు బ్యాంకులో కట్టించుకుంటారు. మరుసటి రోజే అక్కడ బ్యాంకు ఉండదు. మళ్లీ వారికి అవసరమైనప్పుడు అక్కడ బ్యాంకు లాగా ఇల్లును మారుస్తారు. అలాంటిదే ఉలవపాడు మండలం కరేడు గ్రామ పరిధిలో ఉన్న గౌతమబుద్ధ కళాశాల. వారికి అవసరమైనప్పుడు ఒక చిన్న ఫ్లెక్సీ ఏర్పడుతుంది. తరువాత మళ్లీ అక్కడ ఏమీ ఉండదు. ఇదీ గౌతమ బుద్ధ కళాశాల తీరు.

- అధ్యాపకులు, విద్యార్థులు ఉండరు
- కానీ డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయ్
- బీపీఈడీ ఎగ్జామ్స్ పేరిట తంతు
- అంతా మాస్‌కాపీయింగ్



ఇదే ఉత్తుత్తి గౌతమబుద్ధ కళాశాల



కళాశాల ఉన్నట్లుగా తాజాగా వెలిసిన ఫ్లెక్సీ

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కనే వారం రోజుల క్రితం కొత్తగా గౌతమబుద్ధ కళాశాల పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ భవనంలో గతంలో రొయ్యల ఫ్యాక్టరీ ఉండేది. తరువాత అది మూతపడింది. యంత్రసామగ్రి తొలగించారు. అనంతరం ఈ భవనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి ఇందులో ఏమీ ఏర్పాటు చేయలేదు. వాస్తవానికి అందులో ఎవరూ ఉండరు కూడా. కానీ ఇక్కడ కాలేజీ ఉన్నట్లు, అందులో అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నట్లుగా రికార్డులు నడుపుతున్నారు. పరీక్షలప్పుడు మాత్రం ఇక్కడ డిగ్రీ కళాశాల సెంటర్‌ను ఆ శాఖ అధికారులు కేటాయిస్తున్నారు. విశేషం ఏమిటంటే గ్రామ పంచాయతీ పరిధిలో ఇక్కడ కళాశాల లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ ఏకంగా ఆంధ్రకేసరి యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలు కూడా జరుగుతున్నాయి. ఇదీ కూటమి ప్రభుత్వంలో పరీక్షలు జరుపుతున్న తీరు. యూనివర్సిటీ ఆధ్వర్యంలో కనీసం ఇక్కడ కళాశాల ఉందా లేదా అని కూడా పరిశీలించకుండా పరీక్షల సెంటర్లు ఇస్తున్న పరిస్థితి. అంతేకాకుండా సిద్ధమూర్తి మల్లికార్జునరెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల కూడా శింగరాయకొండలోని సోమరాజుపల్లి గ్రామంలో ఉన్నట్లుగా రికార్డుల్లో చూపుతూ ఈ కళాశాలకు సంబంధించిన పరీక్షలు శింగరాయకొండలోని పీఎస్‌సీపీ కళాశాలలో జరగాల్సి ఉండగా అవి కూడా రికార్డుల్లో ఈ కళాశాలలో నిర్వహిస్తున్నారు.

పరీక్షలు మాత్రమేనా...

ఈ కళాశాలలో కేవలం పరీక్షల సమయంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కళాశాలగా చూపించి తాత్కాలిక ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు అన్ని విధాలా కాపీయింగ్ నిర్వహిస్తారు. తరువాత మళ్లీ కళాశాల ఉండదు. విద్యార్థులు ఉండరు. రాజస్థాన్, ఒడిశా విద్యార్థులతో బీపీఈడీ కోర్సులు నిర్వహిస్తున్నారు. పాస్ చేయించి పంపిస్తారు. ఎలాంటి ప్రతిభ లేకుండా పీఈటీలు ఇక్కడ నుంచి బయటకు వస్తున్నారు. ఇంత దారుణంగా విద్యా వ్యవస్థ, పరీక్షలు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్నాయి. ఎక్కడో శింగరాయకొండలో నిర్వహించాల్సిన పరీక్షలు ఇక్కడ జరుగుతున్నాయి. తప్పుడు భవనాలు చూపించి ఇలా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కేవలం కాపీయింగ్ చేసి అందరినీ పాస్ చేయించాలనే ఉద్దేశంతో కళాశాల యాజమాన్యాలు పరీక్ష కేంద్రాలనే మార్చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ విషయమై కరేడు పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను వివరణ కోరగా ఇక్కడ ఎలాంటి భవనాలు లేవని రికార్డులో ఉంది. గతంలో రొయ్యల ఫ్యాక్టరీ ఉన్నప్పుడు పన్ను ఉంది. 2012 లో భవనాలు పడగొట్టినట్లు రికార్డు ఉంది. అప్పటి నుంచి పన్నులేదు. కళాశాల నడుపుతున్నారని తెలిసి వచ్చి కలవాలని తెలియజేశామన్నారు.

ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరీక్షల కోఆర్డినేటర్ భారతిని వివరణ కోరగా ఎక్కడో ఒక చోట పరీక్షలు జరుగుతున్నాయి. అది మా అఫిలియేటెడ్ కళాశాల అందుకని పరీక్షల సెంటర్ ఇచ్చామని తెలిపారు.

కుట్టులో మహిళలకు తోడ్పాటు

- ఉచితంగా శిక్షణ ఇస్తున్న పొన్నగంటి మాధవి
- దాతల సాయంతో పేద మహిళలకు కుట్టుమెషీన్లు కూడా అందజేత

కావలి: పట్టణానికి చెందిన పొన్నగంటి మాధవి కుట్టులో పలువురికి ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా కొంతమందికి కుట్టుమెషీన్లు అందించడంలో సహకరిస్తోంది. చదువుకునే రోజుల్లో కుట్టు నేర్చుకుంటానని ఆమె తండ్రితో చెప్పడంతో శిక్షణ ఇప్పించారు. అంతాగాకుండా కుట్టు మెషిన్ కూడా కొనిపెట్టారు. తరువాత ఇంటి అవసరాలకు ఆ మెషీన్ ఎంతగానో ఉపయోగపడింది. అనంతరం ఆమె వివాహం కావడంతో కుటుంబ బాధ్యతల్లో ఉండిపోయింది. ఇద్దరు పిల్లలు కలిగారు. ఈ క్రమంలో తనకు వచ్చిన కుట్టుమెషీన్ ద్వారా పిల్లలకు, మహిళలకు వెరైటీ డిజైన్లతో దుస్తులు కుట్టడం ద్వారా కుటుంబాన్ని స్వశక్తితో పోషించుకోసాగింది.


శిక్షణలో భాగంగా క్లాత్ మార్కింగ్, కటింగ్ నేర్పుతున్న మాధవి


శిక్షకులకు క్లాత్ కుట్టే విధానం నేర్పుతున్న మాధవి

యువతులకు బాసటగా నిలవాలని..

అయితే యువతులకు, మహిళలకు కొందరికైనా కుట్టు నేర్పితే వారి కుటుంబాలకు కూడా ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఉంటుందని మాధవి తలచింది. అంతే 2015లో శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఉచిత కుట్టుశిక్షణ ఇవ్వడం మొదలు పెట్టింది. ఈమె వద్ద వెరైటీ డిజైన్లలో బ్లౌజ్‌లు కుట్టడం నేర్చుకుని అనేక మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. కావలి పట్టణంలోని పలువురు మహిళలు, యువతులకు మాధవి శిక్షణ ఆసరాగా నిలిచింది. ఒక్కో బ్యాచ్‌కు 30 మంది మహిళలకు 90 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తోంది. ఒక బ్యాచ్ అయిన తర్వాత మరో బ్యాచ్‌కు ఉచిత శిక్షణ ఇస్తోంది.

వెయ్యి మందికి పైగా శిక్షణ

2015 నుంచి ఇప్పటి వరకు 1,050 మంది యువతులు, మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చింది. అలాగే ఉచిత శిక్షణ పూర్తి చేసుకుని, పేదరికంలో ఉన్న వారికి దాతల సహాయంతో ఉచిత కుట్టుమెషీన్‌లు అందేలా చేస్తోంది. అలా ఇప్పటికి 525 మందికి ఉచిత కుట్టుమిషన్‌లు కూడా అందజేసింది. ప్రతి బ్యాచ్ కూడా శిక్షణ పూర్తి అయిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో పేదలైన ఆడపిల్లలకు ఒక జత దుస్తులు కుట్టి ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు అవసరమైన వస్త్రాలు మాధవి సమకూర్చుతోంది. అలాగే పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, దుప్పట్లు పంపిణీ చేయడం, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం కూడా చేస్తోంది.

కుట్టు నేర్పించడంలోనే సంతృప్తి



తోటి మహిళలకు కుట్టు నేర్పించడంలో నాకు ఆత్మ సంతృప్తి ఉంటుంది. అలాగే కుట్టు మెషీన్ కూడా వారికి అందించగలుగుతుంటే రెట్టింపు సంతోషం కలుగుతోంది. ఇది చాలు నా జీవితానికి అని సంతోష పడుతుంటాను. పిల్లల నుంచి పెద్దలు వరకు మహిళలకు సంబంధించిన అన్ని వయస్సుల వారికి కుట్టు నేర్పిస్తున్నాను. ఉచితంగా కుట్టు శిక్షణ ఇన్నేళ్లుగా ఇస్తున్నానంటే దాతలు ప్రోత్సాహం వల్లనే ఇది సాధ్యమైంది.

పొన్నగంటి మాధవి, కుట్టుశిక్షణ నిర్వాహకురాలు

వీఎస్‌యూ అభివృద్ధికి నిధుల వరద


విక్రమసింహపురి విశ్వవిద్యాలయం

- రూ.20 కోట్ల నిధులు కేంద్రం మంజూరు
- గత ప్రభుత్వంలో న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపునకు ప్రోత్సాహం

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. ప్రధాని– ఉషా పథకం కింద రూ.20 కోట్లు మంజూరు చేయడంతో భవనాలు, పరిశోధనా పరికరాలు ఇతర వసతులన్నీ సమకూరి వీఎస్‌యూ రూపురేఖలు మారనున్నాయి. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008లో ఏర్పాటైన వీఎస్‌యూ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని వీఎస్‌యూ అభివృద్ధికి కృషి చేశారు. ఈ క్రమంలో వర్సిటీకి న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు రావడంతో విశ్వవిద్యాలయాలకు లభించే అన్ని రకాల నిధులు వీఎస్‌యూకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం వీఎస్‌యూకు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఉన్నత విద్యా విభాగం నుంచి ప్రధాని– ఉష పథకం కింద రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసింది. ప్రాజెక్ట్ ఆమోద మండలి (పీఏబీ) 3వ సమావేశంలో వీఎస్‌యూలో శాస్త్రీయ, విద్యా, పరిశోధన వసతులు బలోపేతం చేయడానికి ఈ నిధుల వినియోగానికి ప్రకటించారు. ఈ పథకంలో మూడు ముఖ్యమైన భాగాలుగా విభజించి వీఎస్‌యూలో వసతులు సమకూర్చనున్నారు. కొత్త భవనాల నిర్మాణం, ప్రస్తుత భవనాల పునరుద్ధరణ, పరిశోధన పరికరాలు తదితర అంశాలకు ప్రాధాన్యతనివ్వనున్నారు.

చాలా సంతోషకరం



ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అందరి సహకారంతో వీఎస్‌యూ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాను. విశ్వవిద్యాలయ చరిత్రలో అభివృద్ధి కోసం భారీ స్థాయిలో రూ.20 కోట్లు నిధులు మంజూరు కావడం చాలా సంతోషకరంగా ఉంది. ఈ నిధులతో వీఎస్‌యూ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. పరిశోధనా కార్యకలాపాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఇతర అభివృద్ధికి ఈ నిధులు చాలా ఉపయోగపడుతాయి.

– విజయభాస్కరరావు, వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ

జిల్లా జైల్లో న్యాయవిజ్ఞాన సదస్సు

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా జైల్లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి జైల్లో ఉన్న ఖైదీల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించి భోజన నాణ్యతపై ఖైదీలతో మాట్లాడారు. ఖైదీల కేసు వివరాలను అడిగి లాయర్ లేనివాళ్లు ఎవరైనా ఉంటే ఉచితంగా లాయర్‌ను ఏర్పాటు చేస్తామని సూచించారు. చేసిన తప్పులు మళ్లీ చేయకుండా, బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ బాలమహేష్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయ విజ్ఞాన సదస్సులో సివిల్ జడ్జి కె.వాణి

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కావలి: విశాఖపట్నం నుంచి బెంగళూరుకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని కావలి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి, 10.045 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ చెప్పారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా యలమంచిలిలో రాజు అనే వ్యక్తి వద్ద బెంగళూరుకు చెందిన వేలు 10.045 కేజీల గంజాయిని కొనుగోలు చేసి, వాటిని ఆరు ప్యాకెట్లలో ట్రావెల్ బ్యాగ్‌లో పెట్టుకుని లారీలో బయలుదేరాడు. కావలి సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద లారీ దిగి, మరో లారీ ఎక్కడానికి రాజు ప్రయత్నిస్తున్నాడు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకుని విచారించడంతో గంజాయి విషయం బయటపడింది. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. రాజును అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

ఆధునిక వైద్యానికి నూతన ఆవిష్కరణలు దోహదం

- పెరల్స్ ఇన్ క్లినికల్ న్యూరాలజీపై అంతర్జాతీయ సదస్సు
- అపోలో సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహణ

నెల్లూరు (అర్బన్): మెరుగైన వైద్యానికి నూతన ఆవిష్కరణలు దోహదం చేస్తాయని డాక్టర్ బిందుమీనన్ అభిప్రాయపడ్డారు. శనివారం శనివారం నగరంలోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో పెరల్స్ ఇన్ క్లినిక్ న్యూరాలజీ అనే అంశంపై 10వ అంతర్జాతీయ సదస్సు జరిగింది. అపోలో స్పెషాలిటీ ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్, అపోలో ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యూరాలజీలో నూతన ఆవిష్కరణలు, ఆధునిక వైద్యవిధానాల పుస్తకాన్ని విడుదల చేశారు. డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ రోగుల ఆరోగ్యం, సంరక్షణను మరింత మెరుగు పరచడానికి ఏటా సదస్సులు నిర్వహించి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం సంతోషంగా ఉందన్నారు. క్లిష్టతరమైన స్ట్రోక్ మేనేజ్‌మెంట్, ఎపిలెప్సీ (మూర్ఛ), న్యూరో డీజెనరేటివ్ డిజార్డర్స్ అంశాలపై ఆధునికంగా వచ్చిన వైద్య విధానాలను వివరించారు. న్యూరో సమస్యలపై అవగాహన పెంచుకుని తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా స్ట్రోక్ లాంటివి సంభవించినప్పుడు తక్షణమే వైద్య సాయం పొందడం ద్వారా రోగులు వేగంగా కోలుకుంటారన్నారు. తక్కువ ఖర్చుతో రోగికి ఆధునిక వైద్య విధానాలు, నూతన వైద్య పరికరాలను చేరువ చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. కొత్త వైద్య విధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకెళ్తే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే అవకాశముందని తెలిపారు. గడిచిన 10 ఏళ్లుగా పెరల్స్ ఇన్ క్లినికల్ న్యూరాలజీ అనే అంశంపై సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం న్యూరాలజీ వైద్యంలో ఎదురయ్యే పలు సవాళ్లను వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బృందాలుగా ఏర్పడి చర్చించారు. ఈ సదస్సు నిర్వహణను అపోలో హాస్పిటల్స్ సీఈఓ నవీన్‌రెడ్డి, నెల్లూరు అపోలో డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, మెడికల్ రీసెర్చ్ చీఫ్ డాక్టర్ రోహిణి, ఏపీ మెడికల్ కౌన్సిల్ నాయకుడు డాక్టర్ జి.అశోక్ తదితరులు పర్యవేక్షించారు.


న్యూరాలజీ అంశాలపై పుస్తకావిష్కరణ చేస్తున్న అపోలో హాస్పిటల్స్ సీఈఓ నవీన్‌రెడ్డి తదితరులు

సారా స్థావరంపై దాడులు

బిట్రగుంట: బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న స్థావరంపై కావలి ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ టీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్సై దేవిక ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి నాటుసారా తయారు చేస్తున్న కప్పరాళ్లతిప్పకు చెందిన యోహాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడుల్లో కావలి ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం సీజ్

- 8 డ్రమ్ముల వేస్ట్ పూడ్చివేత


కుళ్లిన చికెన్ వ్యర్థాలను పూడ్చిపెడుతున్న మత్స్యశాఖాధికారి, పోలీసు

కోవూరు: కుళ్లిన చికెన్ వ్యర్థాలను చేపలకు మేతగా తరలిస్తుండగా శనివారం మత్స్యశాఖ ఎఫ్‌డీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టుకుని వాహనంతోపాటు సీజ్ చేశారు. శ్రీనివాసరావు సమాచారం మేరకు.. శనివారం తెల్లవారుజామున పాటూరు పరిసర ప్రాంతంలో చికెన్ వ్యర్థాలతో వాహనం వచ్చిందనే విషయమై స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు, వీఆర్వో సహాయంతో చక్కిరాలదిబ్బ ప్రాంతానికి చేరుకుని తనిఖీ చేశామన్నారు. చికెన్ వేస్ట్ వాహనంతో పాటు తరలించిన గుత్తి నందకిషోర్, భక్తాని మహేష్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించామన్నారు. బెంగళూరు నుంచి తక్కువ ధరకు చికెన్ వేస్ట్‌ను కొనుగోలు చేసి వాటిని చేపల చెరువులు సాగు చేసే రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. చికెన్ వేస్ట్ తిన్న చేపలను తింటే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారన్నారు. చికెన్ వ్యర్థాల రవాణా, వినియోగాన్ని కోవూరు ఎమ్మెల్యేతోపాటు తమ శాఖాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారన్నారు. సీజ్ చేసిన చికెన్ వేస్ట్‌ను పూడ్చి పెట్టినట్లు వివరించారు.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి	రూ.25
సన్నవి	రూ.18
పండ్లు	రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	100
లేయర్ (లైవ్)	100
బ్రాయిలర్ చికెన్	186
బ్రాయిలర్ స్కిన్‌లెస్	206
లేయర్ చికెన్	170

డీమార్ట్‌లో ఆహార పదార్థాల నాణ్యత తనిఖీ

నెల్లూరు (బారకాసు): నగరంలోని ప్రముఖ వ్యాపార సంస్థ డీమార్ట్‌లో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను ఎస్‌ఎంసీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వరరావు సంయుక్తంగా శనివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వినియోగదారుల ఫిర్యాదు మేరకు డీమార్ట్‌లో ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేస్తున్నామన్నారు. గడువు తేదీ ఉన్నప్పటికీ లయన్ డేట్స్ ప్యాకెట్లు నాణ్యత కోల్పోయి వినియోగించడానికి పనికి రానివి విక్రయిస్తున్నట్లు ప్రాథమికంగా తేల్చామని తెలిపారు. ప్యాకెట్లను తమతో తీసుకెళ్లి ల్యాబ్‌ల ద్వారా పరీక్షలు నిర్వహించి తదుపరి చర్యలు తీసుకోనున్నామని స్పష్టం చేశారు. బ్రెడ్ ప్యాకెట్స్ గడువు తేదీ మరొక్క రోజు ఉండగా వాటిని వినియోగదారులకు అందుబాటులో ఉంచడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. పూర్తిస్థాయి నివేదిక తర్వాత తగిన నోటీసులు జారీ చేసి సంస్థపై చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీమార్ట్‌లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న హెల్త్ ఆఫీసర్, ఫుడ్ సేఫ్టీ అధికారి

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

నెల్లూరు (క్రైమ్): ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన నగరంలోని వెంగళరావ్ నగర్‌లో శనివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. అన్నమయ్య జిల్లా చిట్వేలు మండలం నగిడిపాడుకు చెందిన మహేశ్వరి (24)కి నెల్లూరు వెంగళరావునగర్‌కు చెందిన చెన్నారాయుడుతో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వారికి హాసిని, దీక్షత్ పిల్లలు. చెన్నారాయుడు ఓ ప్రముఖ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన ఆయన సంపాదించిన మొత్తాన్ని దుబారా చేస్తుండడంతో దంపతుల నడుమ విబేధాలు పొడచూపాయి. అదనపు కట్నం కోసం ఆయన భార్యను వేధించసాగాడు. పలుమార్లు ఈ విషయాన్ని మహేశ్వరి తన తల్లి, బంధువులకు చెప్పడంతో వారు నెల్లూరుకు వచ్చి అల్లుడికి సర్ది చెప్పివెళ్లేవారు. అయినా భర్త, అత్తింటి వారిలో మార్పు రాకపోవడంతో వారం రోజుల కిందట ఆమె పుట్టింటికి వెళ్లి తిరిగి వచ్చింది. శుక్రవారం అర్ధరాత్రి చాతిలో, కడుపులో నొప్పిగా ఉందని మహేశ్వరి భర్తకు చెప్పగా ఆయన గ్యాస్ ట్రబుల్ అయి ఉంటుందని టాబ్లెట్ వేసుకోమని సూచించాడు. ఆమె అలాగే నిద్రపోయింది. శనివారం ఉదయం నిద్ర లేచిన సుబ్బారాయుడు భార్యను లేపే ప్రయత్నం చేయగా ఆమె ఉలుకు పలుకు లేకుండా ఉండడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. భార్య మృతిపై చెన్నారాయుడు తన అత్త జయలక్ష్మికి ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆమె తన బంధువులతో కలిసి హుటాహుటిన నెల్లూరు వెంగళరామ్‌నగర్‌కు చెరుకుంది. విగతజీవిగా పడి ఉన్న కుమార్తెను చూసి కన్నీటి పర్యంతమైంది. అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారు వేధించడం వల్లనే తన కుమార్తె మృతి చెందిందని ఆరోపిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని జయలక్ష్మి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ముత్యాలయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.